క్లుప్తంగా

ఇళయరాజా పేరుతో చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న ఇళయరాజా అభిమానులు

బొబ్బిలి: ప్రముఖ సంగీత దర్శకుడు, మ్యాస్ట్రో ఇళయరాజా పేరుతో బొబ్బిలి పట్టణంలో ఆయన అభిమానులు మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. అటువైపుగా వచ్చే వారందరికీ వాటర్, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. రానున్న వేసవి ఎండల దృష్ట్యా పాదచారులు, ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఇళయరాజా అభిమాన సంఘం అధ్యక్షుడు నేలతూరి వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షులు ఆర్.వెంకటలక్ష్మీప్రసాద్, పి.అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

రామభద్రపురం: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తిరుమలరావు హెచ్చరించారు. మండలంలోని ఆరికతోట గ్రామంలో మంగళవారం పర్యటించిన ఆయన అనవసరమైన గొడవలకు పాల్పడవద్దన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, మద్యం తాగి వాహనాలు నడిపినా, గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలను సేవించినా చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగితే సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సురేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టం అమలు చేయాలి

బొబ్బిలి రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏపీ విద్యా పరిరక్షణ కమిటీ సభ్యులు మంగళవారం ఆందోళన చేపట్టారు. విద్యాహక్కు చట్టం అమలు చేయాలని, టీచర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యా పరిరక్షణ కమిటీ సభ్యులు సీహెచ్ వెంకటరమణ, రామారావు, సత్యంనాయుడు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగి మృతి



సతీష్(ఫైల్)

రామభద్రపురం: మండలంలోని కొత్తరేగ సచివాలయంలో జూనియర్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న మామిడిపల్లికి చెందిన లెంక సతీష్ మంగళవారం మృతి చెందారు. సరిగ్గా ఏడాది క్రితం విధి నిర్వహణలో భాగంగా స్తంభం ఎక్కి, విద్యుత్ షాక్‌కు గురైన ఆయన తీవ్రగాయాలపాలయ్యాడు. అప్పటి నుంచి మంచానికే పరిమితమైన సతీష్ ఇప్పుడు చనిపోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

శరవేగంగా కాలువ నిర్మాణం



కాలువ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఏఈ నాగభూషణరావు

రాజాం సిటీ: రోడ్డు విస్తరణలో భాగంగా మండల కేంద్రంలోని గాయత్రి కాలనీ నుంచి కాలువ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మంగళవారం ఈ పనులను పరిశీలించిన ఆర్అండ్‌బీ ఏఈ నాగభూషణరావు రోడ్డు పనులు పూర్తయిన అనంతరం 80 అడుగుల మేర రోడ్డు విస్తరణ పనులు చేపడతామని తెలిపారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

వంగర: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని బాగెంపేట గ్రామంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై నిర్వహిస్తున్న సర్వేను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని, రక్తహీనత కలిగిన పిల్లలను గుర్తించాలని, స్పందనలో వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగులకు సూచించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

రాజాం సిటీ: యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ పి.నీలావతి సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రగ్స్(మత్తు పదార్థాలు) అనేది ప్రస్తుతం యువతకు ఫ్యాషన్‌గా మారిందని, ఒకరిని చూసి మరొకరు డ్రగ్స్ సేవించడం అలవాటు చేసుకుంటున్నారని తెలిపారు. గంజాయి, కొకైన్, ఖైనీ, గుట్కా, పాన్‌పరాగ్, సారా, మద్యం వంటి వాటిని అలవాటు చేసుకోవద్దన్నారు.

అన్నవరం ట్రస్టుబోర్డు సభ్యునిగా కొల్లూరు

రాజాం సిటీ: అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయ ట్రస్టుబోర్డు సభ్యునిగా రాజాం పట్టణానికి చెందిన కొల్లూరు వెంకట నాగేశ్వరరావు (రవిబాబు) నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి మంగళవారం ఉత్తర్వులు వచ్చాయని ఆయన విలేకరులకు తెలిపారు. ఆయన గతంలో సింహాచలం దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుడిగా పనిచేశారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక పట్టణంలోని ఆరో వార్డులో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన మూడున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో శ్మశానవాటికకు రోడ్డు నిర్మించాలని దేవాంగుల వీధికి చెందిన ప్రజలు వినతించగా, రోడ్డు నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అన్ని వర్గాల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు పాటుపడుతున్నారని, ఆయన ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలకు దేశ వ్యాప్తంగా మంచిపేరుందన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క సమస్య పరిష్కారానికైనా, పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు, నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న కొన్నిరోజులకు సమస్య పరిష్కరించడం జరుగుతోందన్నారు. పథకాలు కూడా అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అందించడం జరుగుతోందన్నారు. ప్రభుత్వ పాలనలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారని, ఇది చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. అప్పటి పాలనకు, ఇప్పటి పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇప్పటివరకు అమలైన పథకాల్లో ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. దీనికి లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నగదు జమచేయడమేనని ఎమ్మెల్యే తెలిపారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.వేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైస్ చైర్మన్ రమాదేవి, ఏఎంసీ వైస్ చైర్మన్ పార్వతి, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

2024లో పార్టీ గెలుపు ఖాయం



జనార్దనరావును పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగులు

రాజాం: 2024 ఎన్నికల్లో అధికార పార్టీ వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. స్థానిక పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన ప్రజలకు నిత్యం మంచి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలు ఎప్పుడూ ఆదరిస్తారని, ఎన్ని దుష్టశక్తులు అడ్డువచ్చినా వచ్చే ఎన్నికల్లోనూ పార్టీ విజయాన్ని అడ్డుకోలేరన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ప్రధాన అజెండాగా ప్రభుత్వ పాలన కొనసాగుతోందన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతి ఒక్క వైఎస్సార్ సీపీతోనే సాధ్యమన్నారు. పార్టీ బలోపేతానికి నియమిస్తున్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులంతా టార్గెట్–175 చేరుకునేందుకు కృషి చేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం ద్వారా ఆ ఇంటికి జరిగిన లబ్ధిని వివరించాలని కోరారు. మరోసారి రాజాంలో, రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ విజయగీతిక వినిపించాలన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ..

రాజాం పట్టణంలోని ఎల్ఐసీ రోడ్డులో నివాసముంటున్న అనకాపల్లి జనార్దనరావును ఎమ్మెల్యే కంబాల జోగులు మంగళవారం కలిసి పరామర్శించారు. బొండపల్లి పీహెచ్‌సీలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ఆయన ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై, చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయి ఇంటికి చేరుకున్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన వద్దకు వెళ్లి, ఆరోగ్యంపై ఆరాతీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట పార్టీ రాజాం, వంగర కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, కరణం సుదర్శనరావులు, ఓలేటి గణపతి, తవుడు, పీఎస్ఎన్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

'ఆధార్ స్పెషల్ డ్రైవ్'ను సద్వినియోగం చేసుకోవాలి

సంతకవిటి: ఆధార్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను అధికారులు కోరుతున్నారు. స్థానిక పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి మంగళవారం పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాలు పొందేందుకు ఆధార్ నమోదు తప్పనిసరి చేసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఆధార్ స్పెషల్ డ్రైవ్ చేపడుతోందని తెలిపారు. ఆధార్‌లోని వివరాలు తప్పులున్నా, వేలిముద్రలు సరిగా పడకపోయినా, ఐరిస్ సమస్య ఉన్నా, ఆధార్ అప్‌డేట్ కావాలన్నా ఆయా కేంద్రాలను చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జనార్దనరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



రేగిడి: దేవుదల కేజీబీవీలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ కాశీవిశ్వనాథరావు

రేగిడి: ఆధార్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని దేవుదల కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)లో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జి. కాశీవిశ్వనాథరావు విద్యార్థులను కోరారు. మంగళవారం ఆధార్ కేంద్రాన్ని పరిశీలించిన ఆయన విద్యార్థులకు కొత్త ఆధార్‌కార్డు కావాలన్నా, కార్డులో తప్పులున్నా, ఏవైనా మార్పులు చేయాలన్నా కేంద్రానికి వస్తే చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రోహిణి తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలతో తహసీల్దార్ బాలమురళీకృష్ణ మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఓటర్ల ఓటరుకార్డుకు ఆధార్ నంబర్ అనుసంధానం చేయాలని సూచించారు.

12 వేల మందికి శాశ్వత భూహక్కు పత్రాలు



భూముల రీసర్వేపై సమీక్షిస్తున్న ఆర్డీఓ శేషశైలజ

బొబ్బిలి రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో ఆర్డీఓ పి.శేషశైలజ వివిధ అంశాలపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. సమగ్ర భూముల రీసర్వే, ఓటర్ ఐడీకి ఆధార్ అనుసంధానాన్ని వేగవంతం చేయాలని అధికారులకు ఆమె సూచించారు. అనంతరం విలేకరులతో ఆమె మాట్లాడుతూ మొదటి విడతలో 100 గ్రామాల్లో సమగ్ర భూముల రీసర్వే పూర్తి చేశామని, రెండో విడతలో మరో 51 గ్రామాల్లో సర్వే చేపడతామని తెలిపారు. ఇప్పటివరకు 12 వేల మందికి శాశ్వత భూహక్కు పత్రాలు పంపిణీ చేశామని, కొన్ని పత్రాల్లోని లోపాలు కూడా సవరించామన్నారు. ఆధార్ అనుసంధానం 50 శాతం కన్నా తక్కువ చేసిన బీఎల్ఓల్లో 42 మందికి మెమోలు కూడా జారీ చేశామన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఎస్.రాజారావు, హెచ్‌డీటీ గౌరీశంకర్, ఆర్ఐ కల్యాణ చక్రవర్తి, సర్వేయర్ అప్పయ్య పాల్గొన్నారు.

4,891 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ



బొబ్బిలి రూరల్: దిబ్బగుడ్డివలసలో ధాన్యం నిల్వలను పరిశీలిస్తున్న విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్

రామభద్రపురం: ధాన్యం సేకరణలో రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రమామణితో మంగళవారం సమావేశమైన ఆయన ధాన్యం సేకరణపై ఆరాతీశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని 1212 మంది రైతుల వద్ద నుంచి దాదాపు 4,891 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. మండలంలో దాదాపు 90 శాతం ధాన్యం సేకరణ పూర్తయిందన్నారు. ఇప్పటివరకు 1130 మంది రైతులకు రూ.8.10 కోట్ల బిల్లులు చెల్లించామన్నారు. 120 మంది రైతులకు రూ.70 లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేసి, ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం నిల్వలు పరిశీలన..

బొబ్బిలి రూరల్: మండలంలోని దిబ్బగుడ్డివలస, సీతయ్యపేట, పాతబొబ్బిలి గ్రామాల్లో ఆర్‌బీకేలు, రైతుల వద్ద నిల్వ ఉన్న ధాన్యంను విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ నారదముని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దిగులు చెందవద్దని, ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు.

రేగిడి: మండలంలోని పలు గ్రామాల్లో రైతులు నూర్పిడి చేసి, కళ్లాల్లో ఉంచిన ధాన్యాన్ని వ్యవసాయాధికారులు మంగళవారం పరిశీలించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా 12 వేల టన్నులు కొనుగోలు చేయడం జరిగిందని, మరో 10 వేల టన్నులు కొనుగోలు చేస్తామన్నారు.

రాజాం: మండలంలోని ఆగూరు, అమరాం, దోసరి, గడిముడిదాం, కంచరాం గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి జమదగ్ని మంగళవారం పర్యటించి, రైతుల వద్ద నిల్వ ఉండిపోయిన ధాన్యం పరిశీలించారు. వెంటనే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తరలించి, ధాన్యం విక్రయించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.శంకరరావు, వ్యవసాయాధికారి రేణుకాసాయి పాల్గొన్నారు.

బాలపార్వతమ్మకు ముర్రాటలు సమర్పణ

సంతకవిటి: మండలంలోని మండాకురిటి గ్రామంలో బాలపార్వతమ్మ పేరంటాలు జాతర వైభవంగా నిర్వహిస్తున్నారు. విజయవాడ, విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు జాతరకు వచ్చి, అమ్మవారిని దర్శించుకుంటున్నారు. మంగళవారం జరిగిన పూజా కార్యక్రమాల్లో మహిళలు అమ్మవారికి ముర్రాటలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

నేడు వెంకంపేటలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

రేగిడి: మండలంలోని వెంకంపేట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్లు వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్‌మోహనరావు ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. మధ్యాహ్నం 3 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు పాల్గొంటారని, మండల స్థాయి పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

536 మందికి రుణాలు

బాడంగి: జగనన్న తోడు పథకం ద్వారా 536 మంది చిరువ్యాపారులకు రుణాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఏపీఎం పి.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక వెలుగు కార్యాయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడిన ఆమె లబ్ధిదారులకు బ్యాంకులు, ఉన్నతి, స్త్రీనిధి ద్వారా రుణాలు అందజేస్తామన్నారు. మండలంలో రూ.6.55 కోట్ల స్త్రీనిధి రుణాలను పొదుపు సంఘాలకు పెట్టుబడి నిధులుగా ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ.5.95 కోట్ల వరకు ఇచ్చామని పేర్కొన్నారు. బ్యాంకు లింకేజీ ద్వారా రూ.28 కోట్ల మేర అంతర్గత అప్పులుగా సమకూర్చాల్సి ఉండగా, ఇంతవరకు రూ.21 కోట్లు మేర ఇప్పించామన్నారు. మిగిలినవి మార్చి నెలాఖరులోగా ఇస్తామన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామి కల్యాణోత్సవంలో హారతి ఘట్టం

బొబ్బిలి: ఆలయ వార్షికోత్సవంలో భాగంగా స్థానిక పట్టణంలోని స్వామి వారి వీధిలో భూ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామి కల్యాణోత్సవం తిలకించేందుకు పట్టణ వాసులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పోటీపడ్డారు. బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్తలు మరిపి వేణుగోపాలనాయుడు, తిరుపతిరావు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక హారతి

బొబ్బిలి రూరల్: మండలంలోని ఎం.బూర్జవలస గ్రామ శ్రీరామ మందిరంలో సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామూహిక హారతి సమర్పణ కార్యక్రమం మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హిందూ ధర్మ వ్యాప్తికి, అభ్యున్నతికి, ధర్మ రక్షణకు పలు ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను హిందువులు నిర్వహించాలని ఫౌండేషన్ డివిజన్ కార్యదర్శి దూపం వాసు కోరారు.

ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి

- సమీక్ష సమావేశంలో ఎంపీడీఓ రామకృష్ణ, హౌసింగ్ డీఈ పి.అప్పయ్య



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ, హౌసింగ్ డీఈ అప్పయ్య

తెర్లాం: ఉగాది నాటికి జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించి, సామూహిక గృహ ప్రవేశాలకు లబ్ధిదారులను సిద్ధం చేయాలని ఎంపీడీఓ రామకృష్ణ, హౌసింగ్ డీఈ పి.అప్పయ్య సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల వ్యాప్తంగా జరుగుతున్న గృహ నిర్మాణాలపై సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పంచాయతీల వారీగా మంజూరైన ఇళ్లు, ఇంతవరకు ప్రారంభమైన ఇళ్లు, పూర్తయిన ఇళ్లు, ప్రారంభం కాని ఇళ్లు ఎన్ని అని ఆరాతీశారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సామగ్రి, రుణాలను ప్రభుత్వం అందిస్తోందని, ఈ నేపథ్యంలో లబ్ధిదారులతో నిర్మాణాలను వేగవంతం చేయించాలన్నారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కూడా కల్పించడం జరుగుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉగాది పండగ రోజున పెద్దఎత్తున సామూహిక గృహ ప్రవేశాలకు సన్నాహాలు చేస్తున్నారని, అప్పటికి మండలంలో ఎక్కువ మంది లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసే చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మండల హౌసింగ్ ఏఈ ఎం.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తుదిదశకు రుషింగి–కిమ్మి వంతెన పనులు



శ్లాబ్ పనులకు ముందు పూజలు చేస్తున్న దృశ్యం

వంగర: మండల పరిధి రుషింగి, పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం కిమ్మి గ్రామాల మధ్య నాగావళి నదిపై వంతెన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఈ మేరకు సర్పంచ్ యలకల భాగ్యలక్ష్మి, శ్రీనివాసరావుతో పాటు ఆర్అండ్‌బీ అధికారులు మంగళవారం ప్రత్యేక పూజలు చేసి చివరిదశ శ్లాబు పనులు ప్రారంభించారు. రూ.29.50 కోట్ల నాబార్డ్ నిధులతో ఈ పనులు చేపట్టారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు యలకల అన్నంనాయుడు, యలకల వాసునాయుడు, సచివాలయ ఉద్యోగులు, ఆర్అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

శతశాతం లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

- ట్రాన్స్‌కో సీఎండీ కె.సంతోష్‌రావు



యూడీసీల వద్ద వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీఎండీ సంతోష్‌రావు

రాజాం సిటీ: ప్రతినెలా ఆయా యూడీసీల పరిధిలో విధించిన లక్ష్యాలను శతశాతం సాధించాలని ట్రాన్స్‌కో సీఎండీ కె.సంతోష్‌రావు సూచించారు. మంగళవారం స్థానిక ఈపీడీసీఎస్ రాజాం డివిజన్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన యూడీసీ వారీగా సమీక్ష నిర్వహించారు. డీలిస్టులు పరిశీలించి, వసూళ్లను ఏ విధంగా చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ శతశాతం లక్ష్యాలను సాధించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బిల్ స్టాప్ డ్రైవ్‌లు వేగవంతం చేయాలని, అధిక మొత్తంలో రికవరీ ఉన్న వినియోగదారుల నుంచి అవసరమైతే ఇన్‌స్టాల్‌మెంట్ పద్ధతిలో వసూలు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీల విద్యుత్ కనెక్షన్లను తొలగించవద్దని, 200 యూనిట్లు దాటితే బిల్లులు చెల్లించేలా చూడాలన్నారు. అనంతరం కార్యాలయం అంతటా పర్యటించి, సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. రైతుల శ్రేయస్సు కోసం వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట పీడీ ఏపీవీ సూర్యప్రతాప్, ఎస్ఈ ఎల్.దైవప్రసాద్ తదితరులు ఉన్నారు.

శతశాతం పన్నుల వసూలుకు చర్యలు

బొబ్బిలి: మున్సిపాలిటీలో ఇంటి, తాగునీటి పన్నుల వసూళ్లను శతశాతం వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ జి.నాగరాజు మంగళవారం తెలిపారు. ఇప్పటివరకు 52 శాతం మేర పన్నుల వసూలు చేపట్టామని, మిగతా వాటిని మార్చి నాటికి వసూలు చేస్తామన్నారు. రీజియన్‌లో 11 మున్సిపాలిటీలు ఉండగా, రూ.116 కోట్లను వసూలు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తాగునీటి పన్నుల బకాయిలు రూ.296 కోట్లు ఉండగా, ఇప్పటివరకు రూ.36 కోట్లు మాత్రమే వసూలైందన్నారు. అలాగే మున్సిపాలిటీల్లో ఎగుడు దిగుడు రోడ్లున్న చోట్ల తాగునీటి కుళాయిలు గోతుల్లో ఉన్నాయని, రీజియన్ పరిధిలో 3,429 గోతులున్నట్లు గుర్తించామన్నారు. వీటిని సమాంతరం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సంక్షిప్తంగా...

విద్యార్థుల సంఖ్య పెంచాలి

తెర్లాం: పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని ఎంఈఓ త్రినాధరావు సూచించారు. మండలంలోని లింగాపురం ప్రాథమిక పాఠశాలను మంగళవారం సందర్శించిన ఆయన 1 నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థుల సంఖ్య బాగా తక్కువగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే విద్యా సంవత్సరంలోగా విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం, మరుగుదొడ్లు, విద్యార్థుల విద్యాప్రమాణాలు, పాఠశాలల్లోని వివిధ రికార్డులను పరిశీలించి, పలు సూచనలు చేశారు.

గ్రౌండ్ ట్రూతింగ్ వేగవంతం చేయండి

తెర్లాం: భూముల రీసర్వేలో భాగంగా మండలంలోని విజయరాంపురంలో చేపడుతున్న గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సచివాలయ సర్వేయర్లను తహసీల్దార్ రాజేశ్వరరావు సూచించారు. మంగళవారం గ్రామంలో జరుగుతున్న గ్రౌండ్ ట్రూతింగ్‌ను పరిశీలించిన ఆయన సర్వే జరుగుతున్న విధానంపై ఆరాతీశారు. సరిహద్దుల గుర్తింపులో ఎటువంటి పొరపాట్లు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట మండల సర్వేయర్ వెంకటరమణ, సర్పంచ్ బి.మధుసూదనరావు పాల్గొన్నారు.

అధికారుల సమన్వయంతో మండల అభివృద్ధి

రామభద్రపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఎంపీడీఓ రమామణి, మండల ప్రత్యేకాధికారి ఎన్.గోవిందరావు సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అధికారులంతా సమన్వయంతో పనిచేసి, మండల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అంతకుముందు శాఖల వారీగా అభివృద్ధి పనులపై ఆరాతీశారు.

రుచి, శుచితో మధ్యాహ్న భోజనం

తెర్లాం: మండలంలోని విజయరాంపురం ప్రాథమికోన్నత పాఠశాలను తహసీల్దార్ డోల రాజేశ్వరరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనం రుచి చూశారు. ప్రతిరోజూ ప్రభుత్వం కొత్తగా అమలు చేసిన మెనూ ప్రకారం భోజనాలు వండాలని, రుచి, శుచితో కూడిన భోజనం విద్యార్థులకు వండి పెట్టాలన్నారు.

ఏప్రిల్ 5న 'చలో ఢిల్లీ'

బొబ్బిలి రూరల్: ఆశావర్కర్ల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఏప్రిల్ 5వ తేదీన చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని ఆశావర్కర్ల సంఘ నాయకులు నారాయణమ్మ, ఎల్లమ్మ, పద్మ, సునీత కోరారు. ఇదే విషయమై ఏర్పాటు చేసిన కరపత్రాలు, పోస్టర్లను మండలంలోని పిరిడి, పక్కి గ్రామ పీహెచ్‌సీల్లో మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం వారు ఢిల్లీలో జరిగే కార్యక్రమానికి ముందు మార్చిలో విజయవాడలో జరిగే ఆశావర్కర్ల సభను విజయవంతం చేయాలన్నారు. నెలకు రూ.26 వేల గౌరవ వేతనం ఇవ్వాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు.

ఘనంగా సంత్ రవిదాస్, రమాబాయి అంబేడ్కర్ జయంతి



సంత్ రవిదాస్, రమాబాయి చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న బీఎస్పీ నేత సాంబయ్య

బొబ్బిలి: స్థానిక పట్టణంలో సంత్ రవిదాస్, రమాబాయి అంబేడ్కర్ జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ సోరు సాంబయ్య పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో జరిగిన మతమార్పిడిలను వ్యతిరేకించి, మతమార్పిడికి గురైన వారిని స్వధర్మంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేసిన మహనీయుడు సంత్ రవిదాస్ అని కొనియాడారు. దళిత జాతి అభ్యున్నతికి కృషి చేసిన మహనీయురాలు రమాబాయి అంబేడ్కర్ అని, వారి ఆశయాల సాధనకు మనమంతా కృషి చేయాలని కోరారు. అనంతరం తారకరామా కాలనీలోని నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

జీవామృతం తయారీపై అవగాహన



రేగిడి: రైతులకు జీవామృతం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస గ్రామంలో జీవామృతం తయారీపై మంగళవారం అవగాహన కల్పించారు. ఏఓ జి.మురళీకృష్ణ సమక్షంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పి.తవిటినాయుడు, కె.రమణ, ఆర్.సింహాచలం ప్రయోగాత్మకంగా జీవామృతం తయారీని వివరించారు. 5 లీటర్ల ఆవుమూత్రం, 5 కిలోల ఆవుపేడ, 5 లీటర్ల నీరు, 150 గ్రాముల సున్నాన్ని ఓ చిన్న డ్రమ్ములో తీసుకుని, 12 గంటలు పాటు నిల్వ ఉంచితే జీవామృతం తయారవుతుందని తెలిపారు. ఈ ద్రావణాన్ని మినప, పెసర, మిరప పంటలకు పిచికారీ చేస్తే, చీడపీడలు సోకకుండా చేయొచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు, రైతులు పాల్గొన్నారు.